అభివృద్ధే అజెండా



కొండవాలు ప్రజలకు అభివాదం చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కె.కె.రాజు

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న 'ఫ్యాన్'

కంచరపాలెం: ఉత్తర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రజలు దీవించి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. 47వ వార్డులో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కంచరపాలెం పరిధి సంజీవయ్య కాలనీ, న్యూ బాపూజీనగర్, సురేష్‌రాంనగర్, అంబేడ్కర్ ఎస్టేట్, జగ్జీవన్ నగర్, చంద్రగిరినగర్, పెద్దకొత్తూరు, అరుంధతి నగర్ కొండవాలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించారు. పలు వీధుల్లో బుల్లెట్‌బండిపై ప్రచారం చేశారు. ఆయనకు స్థానికులు దారిపొడవునా పూలమాలలు వేసి హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు.

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించే మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే జగనన్నను మనమంతా బలపరుచుకోవాలన్నారు. ఒక్క చాన్స్ ఇస్తే కొండవాలు ప్రాంతాలతోపాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని చెప్పారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్ కె.కామేశ్వరి, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, సీనియర్ నాయకుడు బొగ్గు శ్రీను, ధర్మాల ఆనంద్ కుమార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి వసంతల అప్పారావు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిక్కవానిపాలెంలో వృద్ధురాలి దీవెనలు అందుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



అరుంధతినగర్‌లో బుల్లెట్ బండిపై ప్రచారం చేస్తున్న కె.కె.రాజు

అందుబాటులో ఉంటా.. ఆదరించండి



14వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తే ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో రూ.1,500 కోట్లతో రహేజ గ్రూప్ ఇనార్బిట్ మాల్ నిర్మిస్తోందని, సుమారు 15 వేల మంది స్థానికులకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కె.కె.రాజు కోరారు. పార్టీ సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తా



నిషాని వద్ద పవిత్ర వస్త్రాన్ని సమర్పిస్తున్న కె.కె.రాజు

మర్రిపాలెం: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. శుక్రవారం మర్రిపాలెం మస్జీద్ ఈ అల్ ఫతా వద్ద స్థానిక ముస్లింలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. వారిని ఆప్యాయంగా కలిసి ఓట్లు అభ్యర్థించారు. ముందుగా మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ నిషానీ వద్ద ప్రార్థనలు చేసి, అక్క బావుటా(పవిత్ర వస్త్రం) సమర్పించారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్ ఫరూఖీ, పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, షేక్ బాబ్జి, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, ముస్లిం పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యులకు అండగా ఉంటా



ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును సత్కరిస్తున్న కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ
- మద్దతు తెలిపిన కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

సీతంపేట: కళింగ వైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి వ్యాపార అభివృద్ధికి సహకరిస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. అక్కయ్యపాలెం శ్రీకన్యకాపరమేశ్వరి కళింగ వైశ్యుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అబిద్‌నగర్ షాదీఖానాలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ తర్వాత సీఎం వైఎస్ జగన్ హయాంలో మాత్రమే ఉత్తరాంధ్ర, విశాఖ అభివృద్ధి చెందాయన్నారు. ఐదేళ్లలో రూ.435 కోట్లతో ఉత్తర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వాల్లో లేని విధంగా జగన్ పాలనలో ఉత్తర నియోజకవర్గంలో రూ.1500 కోట్లు పెట్టుబడులు తెచ్చామన్నారు. కైలాసపురం రోడ్‌లో రూ.1450 కోట్లతో రహేజా గ్రూప్ ఆధ్వర్యంలో ఇనార్బిట్ మాల్, ఐటీ టవర్, కన్వెన్షన్ సెంటర్ వస్తున్నాయని, తద్వారా ఇనార్బిట్ మాల్‌కు రోజుకు 50 వేల మంది సందర్శకులు వస్తారని అంచనాగా తెలిపారు. గత ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఒక కోటి రూపాయలు పెట్టుబడులు తేలేదని విమర్శించారు. కళింగ వైశ్యుల ప్రయోజనార్థం స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పిలిస్తే పలికే నాయకుడు, మీ కష్టాల్లో అండగా ఉండే కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కరోనా సమయంలో కె.కె.రాజు అందించిన సేవలు గుర్తుచేసుకోవాలన్నారు. కళింగ వైశ్య సంఘం ప్రతినిధులంతా కె.కె.రాజుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయనకు వినతిపత్రం అందజేసి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ మేరువ గణేష్, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కలివరపు దాలిరాజు, గౌరవాధ్యక్షుడు పాట్నూరు నాగరాజు, కార్యదర్శి అంధవరపు రవికుమార్, ఉపాధ్యక్షులు నిరంజన్, లాడి కిషోర్, కిల్లంశెట్టి ప్రకాష్, సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.1.06 లక్షల సీజ్

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్–2, జీవీఎంసీ ఏఓ ఎ.అప్పలనాయుడు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా.. సరైన పత్రాలు లేని రూ.1.06 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. ఆర్.ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి తన కారులో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి మురళీనగర్ రోడ్డులో వెళ్తున్నాడు. బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద ఏఓ అప్పలనాయుడు, ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ టి.శివకృష్ణ ఆ కారును ఆపి తనిఖీ చేయగా.. రూ.1,06,000 నగదు గుర్తించారు. ఆ వ్యక్తిని వారు విచారించగా.. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఆర్వో కార్యాలయానికి అప్పగించారు.

క్లుప్తంగా

కె.కె.రాజుతోనే 'ఉత్తర' అభివృద్ధి



కొండవాలు ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం పరిధి కస్తూరినగర్, శాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో శుక్రవారం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గం మరింత అభివృద్ధి, ప్రజలకు మరింత మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కొండవాలులో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు.

పైడిమాంబ జాతరకు ఏర్పాట్లు



జాతర ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘ అధ్యక్షుడు బోర ఈశ్వరరావు

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం జూన్ 11న జరగనుందని శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బోర ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయంలో శుక్రవారం జాతర ప్రచార పత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జూన్ 9న పండగ చాటింపు, 10న తొలేళ్లు, 11న ప్రధాన పండుగ జరుగుతాయని చెప్పారు. సంఘ కార్యదర్శి సారిపిల్లి గంగరాజు మాట్లాడుతూ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తులు, భక్తులందరూ సహకరించి జాతరను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు నమ్మి వెంకట్, కోశాధికారి బోర వెంకటరమణ, వారాధి శ్రీను, సానబోయిన సురేష్, మంచిపిల్ల ఆదిబాబు, ఇసరపు అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఇసరపు రాజేష్, ఆలయ అర్చకుడు శివగణేష్ శర్మ, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చదరంగం ఉచిత శిక్షణలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. శిక్షకుడు ఎస్.ఉమాపతి పర్యవేక్షణలో ఉత్సాహంగా జరిగిన చెస్ పోటీల్లో ఏడేళ్ల లోపు విభాగంలో రుత్విక్, ఘన స్కంద్, అక్షర మొదటి మూడు స్థానాల్లో నిలవగా.. 8–10 ఏళ్ల విభాగంలో నిఖిల్, హర్షిత్, తన్వీర్, 11–15 ఏళ్ల విభాగంలో చండీశ్వర్, కె.లోకేష్, బీఏ స్వాతి, మహిళలకు నిర్వహించిన పోటీల్లో రమాదేవి, సుజన, జోషిక మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి త్వరలో బహుమతులు అందిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి చెల్వరాజు తెలిపారు. జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు పోటీల నిర్వహణకు సహకరించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

వైఎస్సార్‌సీపీలోకి కాంగ్రెస్, టీడీపీ నాయకులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు పెరుగుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన గొంపా గోవిందరాజు ఆధ్వర్యంలో పలువురు ఉత్తర నియోజకవర్గ నాయకులు పార్టీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో చేరిన కాంగ్రెస్ నాయకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో కమలాకర్ రావు, గొంపా శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఎం.డి. హర్షద్, కాంగ్రెస్ పార్టీ 43వ వార్డు ప్రెసిడెంట్ జి.ఫాతిమా, 49వ వార్డు ప్రెసిడెంట్ వి.ఆనంద్‌కుమార్, 48వ వార్డు ప్రెసిడెంట్ ఎ.రాజేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

పార్టీ విజయానికి కృషి చేయండి

జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్, చిన్నూరు, లలితానగర్ ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, ముత్యం యువసేన సభ్యులు కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజ్, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు అమ్మాజీ, బ్రహ్మాజీ, రాంబాబు, కిశోర్, సురేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు, యువసేన సభ్యులను ఆహ్వానిస్తున్న కె.కె.రాజు

చిన్నారి వైద్యానికి 'బాణాల' సాయం



చిన్నారి తండ్రికి నగదు సాయం అందజేస్తున్న కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఓ చిన్నారి వైద్యానికి సాయమందించి అండగా నిలిచారు. వివరాలిలా.. వార్డులోని ఎంటీసీ పాలేనికి చెందిన వాటర్ ట్యాంకు ఆటో నడిపే సాయి అనే వ్యక్తికి ఐదు నెలల కిందట పుట్టిన శిశువు తరచూ అనారోగ్యానికి గురికావడంతో కేజీహెచ్‌లో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి చిన్నారి గుండెలో రంధ్రం ఉన్నట్టు గుర్తించారు. వారం రోజుల్లో ఆపరేషన్ చేయాలని చెప్పడంతో ఆర్థిక ఇబ్బందులతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో తిరుపతిలోని పద్మావతి పిల్లల హార్ట్ సెంటర్‌లో ఆపరేషన్ చేయించాలని నిర్ణయించారు. తిరుపతి వెళ్లడానికి దారి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు దృష్టికి తీసుకురావడంతో ఆయన పెద్ద మనసుతో స్పందించారు. తిరుపతి వెళ్లడానికి రూ.10 వేల నగదును శుక్రవారం చిన్నారి తండ్రికి సాయంగా ఆయన అందించారు. బాణాల శ్రీనివాసరావు చేసిన సాయంపై ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఎంటీసీ పాలెం వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మద్దతివ్వండి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే, విశాఖను పరిపాలన రాజధాని చేసుకోవాలని, దీని కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు మద్దతుగా ఉత్తర నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, దుప్పలపూడి శ్రీనివాస్, యువజనగ విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, బొడ్డేటి గంగామహేష్, వై.శ్రీనివాసరెడ్డి, విశ్వతేజ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



జాతీయ స్థాయి పోటీల విజేతలను సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైడ్

మురళీనగర్: త్వరలో అయోధ్యలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విశాఖ నగర మాస్టర్స్ అథ్లెట్స్ సత్తా చాటాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైడ్ ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఇంటర్నేషనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించిన విశాఖ క్రీడాకారులను ఆయన అభినందించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 26 నుంచి 28 వరకు ముంబైలో నిర్వహించిన 43వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024లో ఆంధ్రప్రదేశ్ తరఫున విశాఖ క్రీడాకారులు పాల్గొని వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. మురళీనగర్ చేరుకున్న పతకాల విజేతలు డి.సరోజిని, బి.విజయలక్ష్మి, డి.రమణమ్మ, టి.సుధాకర్, ఎస్.దుర్గ, అమిత్, లక్ష్మణరావు, పాటిల్, ఎం.తాతారావు, ఎం.రామారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.వంశీ, ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రెటరీ జనరల్ ఎం.వరప్రసాద్, విశాఖ వెటరన్ అథ్లెట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

మహారాణిపేట: మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని గ్రీన్‌క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తూ శుక్రవారం ఫిషింగ్ హార్బర్ చేపల మార్కెట్‌లో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌ల ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ అనంతరావు తమ సిబ్బందితో శుక్రవారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాజస్థాన్ రాష్ట్రం ఆళ్వార్ జిల్లాకు చెందిన సతీష్‌కుమార్ యాదవ్ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అతడి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

ప్రచార పర్వం



49వ వార్డులో శుక్రవారం కె.కె.రాజును గెలిపించాలని కోరుతూ వార్డు నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలు అందిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు - మర్రిపాలెం



51వ వార్డు కళింగనగర్ పరిసర ప్రాంతాల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వార్డు నాయకులు - మర్రిపాలెం



50వ వార్డు సాయిరాంనగర్ కొండవాలు ప్రాంతంలో కె.కె.రాజును గెలిపించాలని ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ - మర్రిపాలెం



44వ వార్డు ఎంటీసీ పాలెంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాల తరుణ్ - సీతంపేట



24వ వార్డు గాంధీనగర్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, గుడ్ల అశోక్‌రెడ్డి తదితర పార్టీ నాయకులు - సీతమ్మధార



జీవీఎంసీ 25వ వార్డు గణేష్‌నగర్, మధురానగర్ ప్రాంతాల్లో కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ - సీతంపేట

సికింద్రాబాద్-బ్రహ్మపూర్ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్–బ్రహ్మపూర్–సికింద్రాబాద్ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా..

- సికింద్రాబాద్–బ్రహ్మపూర్(07035) రైలు ఈ నెల 11, 14 తేదీల్లో రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07036) రైలు ఈ నెల 12, 15 తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్–బ్రహ్మపూర్(07027) స్పెషల్ రైలు ఈ నెల 10వ తేదీ రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07028) రైలు ఈ నెల 11న సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.